ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ వేములనర్వలో ఉలిక్కిపాటు

- గ్రామానికి చెందిన విజయలక్ష్మిగా అనుమానం
- నియోజకవర్గ వ్యాప్తంగా కలకలం

ప్రజాయుద్ధనౌక గద్దర్‌తో విజయలక్ష్మి (ఫైల్)

వేములనర్వలో విజయలక్ష్మి నివాసం (ఇన్‌సెట్‌లో) విజయలక్ష్మి (ఫైల్)

కేశంపేట, మే 23 : చిన్నతనం నుంచే సమాజానికి సేవ చేయాలన్న తపన ఆమెది.. తనకున్న పరిమిత సౌకర్యాల్లో విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పింది. మారుమూల పల్లెలోని నిరుపేద కుటుంబంలో జన్మించినా.. ఉన్నత చదువును అభ్యసించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన అనంతరం ఉద్యమానికి ఆకర్షితురాలై అడవుల బాట పట్టినట్లు తెలిసింది. 13ఏండ్ల అజ్ఞాతం అనంతరం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిందన్న వార్త రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కలకలం రేపుతున్నది. కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన సాయిలుగౌడ్ రాధమ్మ దంపతుల చిన్న కుమార్తె విజయలక్ష్మి(40) ఇంటర్ వరకు కేశంపేటలో, మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో చదివింది. ఉన్నత చదువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిందని, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పొలిటికల్ సైన్స్ చదువుతున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై అడవులబాట పట్టినట్లు తెలిసింది.

కుటుంబ నేపథ్యం..

వేములనర్వ గ్రామానికి చెందిన సాయిలు గౌడ్ రాధమ్మ దంపతులు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిచేవారు. వారికి ముగ్గురు కుమార్తెలు జన్మించారని, అందులో చిన్న కుమార్తె విజయలక్ష్మి చదువులో చురుగ్గా ఉండేదని, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సమాజహితం కోసం పరితపించేదని తెలిసింది. విజయలక్ష్మి ఏడాది పాపగా ఉన్నప్పుడే తల్లి పాముకాటుకు గురై మృత్యువాత పడిందని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కష్టపడి ఉన్నత చదువును అభ్యసించినట్లు సమాచారం. ఉద్యమబాట పట్టిన తర్వాత కుటుంబ సభ్యులను ఏనాడు కలుసుకోలేదని, గ్రామానికి సైతం రాలేదని స్థానికులు చెబుతున్నారు.

మలిదశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జరిగిన మలిదశ ఉద్యమంలో విజయలక్ష్మి క్రియాశీల పాత్ర పోషించిందని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో ప్రజా యుద్ధనౌక గద్దర్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నదని, సకల జనుల సమ్మె, రైలు రోకో, వంటావార్పు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పొలిటికల్ సైన్స్ చదువుతున్న సమయంలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలై అడవుల బాట పట్టిందని, పోలీసుల ఎన్‌కౌంటర్‌లో విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందిందన్న విషయం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చకు దారితీసింది.

వేములనర్వలో..

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశంపేట మండలంలోని వేములనర్వ గ్రామానికి చెందిన యువతి మృతి చెందిందన్న వార్త ప్రచారం కావడంతో గ్రామంలో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గ్రామమంతా ఒక్కసారిగా ఏమి జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. 13ఏండ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిన విజయలక్ష్మి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెలికినా ఫలితంలేకుండా పోయింది. తీవ్ర మనోవేదనతో ఉన్న కుటుంబాలకు ఎన్‌కౌంటర్‌లో విజయలక్ష్మి అలియాస్ భూమిక మృత్యువాత పడిందన్న సమాచారం తెలియడంతో ఆ కుటుంబం మూగరోదన అనుభవిస్తున్నది.

మానవత్వం చాటుకున్న సబిత

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట, మే 23: మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న వారిని పలకరించి వారి గురించి తెలుసుకొని ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకుంటున్నారు. మహేశ్వరం గేటు వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న సిబ్బంది పైకి ద్విచక్ర వాహనం దూసుకురావడంతో ఒక వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. పలు వివాహ వేడుకల్లో పాల్గొని మహేశ్వరం నుంచి హైదరాబాద్ వైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గమనించి గాయాల పాలైన వృద్ధుడిని దవాఖానకు పంపించి మానవత్వం చాటుకున్నారు. ఆమె వెంట మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రామ్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, నందినేని నరేందర్ రెడ్డి ,మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ఎస్టీసెల్ మాజీ అధ్యక్షుడు లచ్యా నాయక్, వెంకట రాజిరెడ్డి, మహేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- దౌల్తాబాద్‌లో గ్రంథాలయ నూతన భవనం ప్రారంభం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, మే 23 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో గ్రంథాలయ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో నెట్టుకు రావడానికి విద్యతో పాటు విజ్ఞానం ఎంతో ముఖ్యమన్నారు. ఇందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆనాటి మహానుబావులు ఎందరో లైబ్రరీలను సద్వినియోగం చేసుకుని సమాజాన్ని తీర్చిదిద్దే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో ఉన్న పోటీ పుస్తకాలను యువత ఉపయోగించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కూడా చిన్న చిన్న గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని సూచించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, గ్రంథాలయ డిప్యూటీ సెక్రటరీ సురేశ్‌బాబు, గ్రంథాలయ సంస్థ నారాయణపేట జిల్లా చైర్మన్ విజయ్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్లకు ప్రత్యేక శిక్షణ

పెద్దమంగళారంలోని గురుకుల కోడింగ్ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ పొందుతున్న టీచర్లు

మొయినాబాద్, మే 23 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కోడింగ్ పాఠశాలలోని రెగ్యులర్ టీచర్లు, ఐసీటీ సిబ్బందికి గురుకుల విద్యా సంస్థ ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నది. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో ఉన్న గురుకుల కోడింగ్ పాఠశాలలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని 1 నుంచి 7 జోన్లలోని మొత్తం 238 పాఠశాలల నుంచి ప్రతి పాఠశాలలోని ఒక రెగ్యులర్ టీచర్‌తో పాటు ఒక ఐసీటీ సిబ్బందికి దశల వారీగా శిక్షణ ఇస్తున్నారు. టీచర్లు, ఐసీటీ సిబ్బందికి స్పెషల్ ప్రోగ్రాంఎక్స్‌టెన్షన్ ఆఫ్ కోడింగ్ అండ్ కంప్యూటింగ్ కరికులంపైన రాస్ బెర్రీఫై ఫౌండేషన్ సిబ్బందితో గురుకుల విద్యా సంస్థల అధికారులు శిక్షణ ఇప్పిస్తున్నారు. వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం ఈ నెల 13న ప్రారంభం కాగా జూన్ 6 వరకు కొనసాగనున్నది. ప్రతి రెండు జోన్లు కలిపి 5 రోజుల పాటు అన్ని జోన్లకు శిక్షణ ఇప్పించనున్నారు. శిక్షణలో భాగంగా జోన్ 1, 2లోని 103 మంది స్టెమ్ రెగ్యులర్ టీచర్లు, ఐసీటీ సిబ్బందికి ప్రిన్సిపుల్స్ ఆఫ్ టీచింగ్ కంప్యూటింగ్, స్క్రాచ్, పైథాన్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామని పెద్దమంగళారంలోని గురుకుల కోడింగ్ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. జోన్ 3, 4 జూన్ నుంచి పాఠశాలలోని 127 మందికి ఈ నెల 23 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. తర్వాత మిగిలిన 5, 6, 7 జోన్లకు జూన్ 6 వరకు శిక్షణ పూర్తి చేస్తామన్నారు. టీచర్లు, ఐసీటీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు.

విభిన్న వ్యవసాయ విధానాలతో అధిక ఆదాయం

రైతులతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

బొంరాస్‌పేట, మే 23 : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఇంటెన్సివ్ ఇంటిగ్రేటెడ్(ఐఎఫ్ఎస్)ను సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఎకరా పొలంలో పండ్లతోటలు, దేశీకోళ్ల పెంపకం, ఫారంపాండ్, చేపల పెంపకం తదితర విభిన్న వ్యవసాయ విధానాలపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వెంకటయ్య అనే రైతు ఏడాదికి అదనంగా రూ.40వేలు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. ఈ సందర్శన వాసన్ సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. పోషణ, వనితల వ్యాపారం, పోషకాహారం, సమగ్రంగా తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఇందుకు సంబంధించి అధికారులు అవగాహన కల్పించారు. వారి వెంట వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి, బృందం సభ్యులు, అధికారులు, రైతులు ఉన్నారు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌పై వేటు

డాక్టర్ రవికుమార్ స్థానంలో డా.విజయ్‌కుమార్ నియామకం

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ సూపరింటెండెంట్ డా.రవికుమార్‌పై ప్రభుత్వం వేటు వేసింది. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డా.విజయ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇదిలా ఉంటే మొదటి నుంచి వివాదాస్పదుడిగా ఉన్న డా.రవికుమార్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడంపై అప్పట్లోనే అనేక విమర్శలు వచ్చాయి. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారంగా దవాఖానలో క్లినికల్ ట్రయల్స్ జరిపిన కేసుతో పాటు పలు ఇతర అంశాల్లో ఆయనపై చార్జీషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నిబంధనల ప్రకారం చార్జీషీట్‌లు పెండింగ్‌లో ఉన్న వైద్యాధికారులకు సూపరింటెండెంట్ వంటి పరిపాలనా బాధ్యతలు అప్పగించకూడదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చార్జీషీట్లతో పాటు వివిధ అంశాల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న డా.రవికుమార్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడంపై మొదటి నుంచి విమర్శలు తలెత్తుతూనే ఉన్నాయి. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కొత్తలోనే పీజీలను వేధిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుపై అప్పటి డీఎంఈ డా.వాణి అంతర్గత విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఆ తరువాత దవాఖానలోని బ్లడ్ బ్యాంక్‌లో నుంచి బ్లడ్ ప్యాకెట్లు చోరీకి గురవడంతో పాటు తరచూ ఏదో ఒక వివాదంతో నిలోఫర్ దవాఖాన వార్తల్లో నిలుస్తూ వస్తోంది. ఇలా ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రభుత్వ పెద్దల అండదండలతో డాక్టర్ రవికుమార్ రెచ్చిపోయారు. ఇకనైనా నిరుపేదలు చికిత్స పొందే ప్రభుత్వ దవాఖానల్లో అర్హత, నిజాయితీ గల అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నిమిషం ఆలస్యమైనా.. నో ఎంట్రీ

వీఏవో పరీక్ష రాసే అభ్యర్థులకు సూచనలు

వికారాబాద్, మే 23 : గ్రామ పాలన అధికారి (వీఏవో) పరీక్ష రాసే అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతి ఉండదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు సీఎస్ఎల్ఏ మార్గదర్శకాలను అనుసరించి శుక్రవారం ఆయన పలు సూచనలు జారీ చేశారు. అభ్యర్థులందరూ ఈ సూచనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని, అందులో ఉన్న వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. పరీక్ష కేంద్రం చిరునామాను ముందుగానే గుర్తించుకోవాలన్నారు. పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని, వాటిలో ఒకదాన్ని నియంత్రణాధికారి సంతకం చేసి హాల్ టికెట్‌పై అంటించాలని తెలిపారు. మరో ఫొటోను పరీక్ష గదిలో పర్యవేక్షకుడికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిషేధిత ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు రావద్దని, సెల్ ఫోన్లు, డిజిటల్ వాచీలు, పెన్‌డ్రైవ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాలులో నిషేధించామని వివరించారు. అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకురావాలన్నారు. జెల్ పెన్‌ను ఉపయోగించవద్దన్నారు. పర్యవేక్షకుల సూచనలను పాటించాలన్నారు. పరీక్ష హాలులో నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు పరీక్ష హాలులోకి అనుమతించమని అధికారుల స్పష్టం చేశారు. ఎంప్లాయ్ గుర్తింపు కార్డ్, ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

పోస్టు చేసిన మైనర్ బాలుడిపై పాక్సో

మైనర్ బాలిక అశ్లీల వీడియో

పరిగి, మే 23 : పిల్లలు సెల్‌ఫోన్ వాడుతున్న తీరును తల్లిదండ్రులు గమనిస్తుండాలని, ఓ మైనర్ బాలిక అశ్లీల వీడియోను పరిగి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలుడు డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాగ్రామ్ అప్లికేషన్‌లో పోస్ట్ చేయడంతో ఐటీ చట్టం 2000-2008, పాక్సో చట్టం కింద బాలుడిపై కేసు నమోదు చేశామని పరిగి సీఐ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ సంతోశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలుడు తన సెల్‌ఫోన్‌లో అశ్లీల వెబ్‌సైట్ నుంచి మైనర్ బాలిక అశ్లీల వీడియోను డౌన్‌లోడ్ చేసుకొని చూడడంతోపాటు ఈ వీడియోను పబ్లిక్ డొమైన్ అయిన తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నుంచి ఇన్‌స్టాగ్రామ్ అప్లికేషన్‌లో పోస్ట్ చేశారన్నారు. ఈ విషయాన్ని సైబర్ టిప్లైన్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్, చైల్డ్ సెక్స్వల్ అబుస్, ఎక్స్‌ప్లోయిటేటివ్ మెటీరియల్‌ను ట్రేస్ చేసి జిల్లా ఎస్పీకి నివేదిక అందించారన్నారు. ఈ నివేదికను పరిగి పోలీస్‌స్టేషన్‌కు పంపించారని, దీని ఆధారంగా ఆ బాలుడిపై ఏప్రిల్ 30న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బాలుడిని విచారించగా కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు వినేందుకు తన తల్లిదండ్రులు ఒక స్మార్ట్ ఫోన్‌ను అతడికి ఇవ్వగా ఏదో గుర్తు తెలియని వెబ్‌సైట్ నుంచి ఒక గుర్తు తెలియని మైనర్ బాలిక అశ్లీల వీడియో డౌన్‌లోడ్ చేసుకొని చూసి, దాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నుంచి ఇన్‌స్టాగ్రామ్ అప్లికేషన్‌లో పోస్ట్ చేశారని తేలిందన్నారు. ఈ విషయంలో బాలుడిపై కోర్టులో తుది నివేదిక సమర్పించామని వారు పేర్కొన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు వాడుతున్న తీరును తల్లిదండ్రులు గమనిస్తుండాలని, తెలిసో తెలియకో నిషేధిత వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేసే సమయంలో మనగోప్యత అవతలి వారికి తెలిసి మనల్ని సైబర్ చర్యలకు గురిచేయవచ్చన్నారు. మైనర్ అమ్మాయిలకు సంబంధించి ఎలాంటి అసభ్యకరమైన చర్యలకు గురిచేసినా చట్ట ప్రకారం శిక్షిస్తామని వారు తెలిపారు.

క్షయ, హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

దోమలో దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

దోమ, మే 23 : క్షయ, హెచ్ఐవీ తదితర దీర్ఘకాల వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, సీహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని బురుజుకట్ట వద్ద జిల్లా వైద్యాధికారులు ప్రజలతో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి క్షయ, హెచ్ఐవీ, మధుమేహం తదితర ధీర్ఘకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. దగ్గు ఛాతిలో నొప్పి, జ్వరం, బరువు తగ్గుట, ఆయాసం ఉన్న వారు తప్పనిసరిగా తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం కోసం ప్రతి టీబీ పేషెంట్‌కు రూ.1000 ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో సర్వే చేయించి ఈ పేషెంట్లను గుర్తించడంతో పాటుగా వారికి సరిపడా మందులను సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల్, హెచ్ఈవో ప్రభులింగం, డీపీవో హైదర్ అలీ, నవీన్‌గౌడ్, గోపాల్, రాజూనాయక్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హై-లైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సిటీబ్యూరో, మే23,(నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద ఫ్యాషన్, లగ్జరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌గా పేరుగాంచిన "హై-లైఫ్ ఎగ్జిబిషన్" వేసవి స్పెషల్ ఎడిషన్‌తో హైదరాబాద్‌లోని హెచ్ ఐసీసీ (నోవోటెల్), హైటెక్ సిటీలో మే 23 నుంచి నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సినీ నటులు మాల్వీ మల్హోత్రా, శ్రావంతి చోకారపు, సుభశ్రీ రాయగురు తదితరులు హాజరై ప్రారంభించగా, పలువురు మోడల్స్, ఫ్యాషన్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ వేడుకలో సమ్మర్ స్పెషల్ ఎడిషన్ కింద ప్రదర్శించిన గ్లిట్జ్-గ్లామర్, స్టైల్, లగ్జరీతో కూడిన నూతన వస్త్రరంగులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ వాసులకు వేసవి ఫ్యాషన్‌లో నూతన ధోరణులు చూపించేందుకు ఈ ఎగ్జిబిషన్ ప్రధాన వేదికగా నిలుస్తోంది.

నిరీక్షణ.. ప్రదక్షిణ

- జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం జనం ఎదురుచూపు
- మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- సైట్ అప్‌డేట్ చేయించడంలో అధికారుల అనాసక్తి
- హడావుడి సమయంలో మాత్రమే పై అధికారులకు ఫోన్లు

మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది

మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం

మొయినాబాద్, మే 23 : జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికోసం జనం నిరీక్షిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయంలో పనులు చకచకా అవుతున్నా.. మున్సిపల్ శాఖకు వచ్చేసరికి ధ్రువపత్రాలకు బ్రేక్ పడుతున్నది. మొయినాబాద్‌లో నూతన మున్సిపాలిటీ ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ.. మున్సిపల్ శాఖలో విలీనం కాలేదా..? విలీనమైనా పనులు చేయడంలో ఆ శాఖ నిర్లక్ష్యం చేస్తున్నదా..? అనే సందేహం జనంలో కలుగుతున్నది. మున్సిపాలిటీ పరిధిలోని 8 గ్రామాల ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పొందడానికి నానా తంటాలు పడుతున్నారు. వీటి కోసం మున్సిపల్ శాఖ నుంచి నాన్ అవలబిలిటీ పత్రం మాత్రమే పొందుతున్నారు. ఆ తర్వాత రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయాల్లో చకచకా పనులు అవుతున్నాయి. ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రొసీడింగ్‌లు పొంది మున్సిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇక్కడ మాత్రం రిజిస్ట్రేషన్ కావడం లేదు. దరఖాస్తులందరూ రిజిస్ట్రేషన్ నంబర్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇందుకోసం కార్యాలయం చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. వారు వెళ్లి అడిగినప్పుడు సైట్ రావడం లేదని సమాధానం చెబుతున్నారు. ఆ సమయంలో మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫోన్ కాల్ చేయగా అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో లేని సమస్య మీ కార్యాలయంలో ఎందుకొస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విలీనం తర్వాతే ఇబ్బందులు

మున్సిపాలిటీ విలీనం తర్వాత జనన, మరణ ధ్రువపత్రాలు పొందడం గగనంగా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇలా ఉంటే, ఆ తర్వాత ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఆధార్‌కార్డు పొందడానికి, తప్పు ఒప్పులను సరి చేసుకోవడానికి జనన ధ్రువీకరణ పత్రం చాలా అవసరం. విద్యా సంస్థలో దీని ప్రాధాన్యత చాలా ఉంది. అలాగే మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా మృతి చెందితే ధ్రువీకరణ పత్రం పొందడం చాలా కష్టంగా మారింది. జీవిత బీమా ఉన్న వారు చనిపోతే వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం కావాలి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంచాయతీలో చకచకా అయ్యేవి

మా పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయంలో చకచకగా పనులయ్యేవి. కొత్తగా మున్సిపాలిటీలో విలీనం కావడంతో జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను నిలిపివేశారు. మున్సిపాలిటీ ఏర్పాటైన మూడున్నర నెలల తర్వాత సైట్ ఓపెన్ అయిందని చెప్పారు. ప్రొసీడింగ్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయడానికి దరఖాస్తు పెట్టుకుని 20 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఎప్పుడు అడిగినా సైట్ ఓపెన్ కావడం లేదంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు స్పందించి సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి.

- కొత్తపల్లి విక్రమ్‌రెడ్డి, సురంగల్

రైతు బీమా క్లెయిమ్ ఎలా?

నాలుగు నెలల క్రితం సురంగల్‌లో మా అల్లుడు మర్ల ప్రసాద్ చనిపోయాడు. ఆయన పేరు మీద రైతు బీమాను క్లెయిమ్ చేసుకోవడానికి మరణ ధ్రువీకరణ పత్రం అడుతున్నారు. మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత మరణ ధ్రువీకరణ పత్రాలను నిలిపివేశారు. నాలుగు నెలల తర్వాత సైట్ ఓపెన్ అయిందని చెప్పడంతో దరఖాస్తు చేసి 15 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు మున్సిపల్ కార్యాలయంలో పని కావడం లేదు. ఆన్‌లైన్ రావడం లేదని చెబుతున్నారు. సర్టిఫికెట్ కోసం రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ప్రతి రోజూ సైట్ రావడం లేదని మాత్రమే సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

- బైకని చెన్నయ్య యాదవ్, చిలుకూరు